సంక్షేమం, అభివృద్ధిలో రయ్ రయ్

ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని గ్రామాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రగతి బాట పట్టాయి. ఊరూరా సీసీరోడ్లు, సైడు డ్రెయిన్లు, సచివాలయ భవనాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిర్మాణమయ్యాయి. నవరత్నాల పేరుతో వివిధ వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. రాజకీయ పార్టీ ప్రమేయం, వివక్షకు తావులేకుండా వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తుండడంతో అర్హులందరికీ పథకాలు అందుతున్నాయి.

మారిన చెర్లోపల్లి గ్రామ రూపురేఖలు

- రూ.10 కోట్ల సంక్షేమ ఫలాలు జమ
- రూ.5.12 కోట్లతో అభివృద్ధి పనులు

మనుబోలు : ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిఇంటికీ సంక్షేమ పథకాలు అందాయి. ప్రతి గ్రామం అభివృద్ధి చెందింది. వీటితో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రతి గ్రామంలో పర్యటించారు. క్షేత్రస్థాయిలో ప్రజలెదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించారు. ఇందుకోసం ప్రభుత్వం ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేసింది.



చెర్లోపల్లి గ్రామ సచివాలయం



రైతు భరోసా కేంద్రం

లబ్ధిదారుల ఖాతాలో సంక్షేమ ఫలాలు

కేవలం 1,700 మంది జనాభా కలిగిన చెర్లోపల్లి పంచాయతీ పరిధిలో వివిధ సంక్షేమ పథకాల రూపంలో డీబీటీ(డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా రూ.6,50,06,821ల నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. జగనన్న అమ్మఒడి, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ పెన్షన్ కానుక, మత్స్యకార భరోసా, చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ నేతన్న నేస్తం, హౌసింగ్‌కు చెల్లింపులు, జగనన్న చేదోడు తదితర 33 పథకాల ద్వారా ఈ నగదు జమ చేశారు. ఇవి కాకుండా నాన్ డీబీటీ ద్వారా లబ్ధిదారులకు రూ.3,24,32,938ల లబ్ధి చేకూర్చారు. జగనన్న లేఅవుట్‌ల కోసం భూముల సేకరణ, ప్లాట్ల అభివృద్ధి, జగనన్న విద్యా కానుక, విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ, జగనన్న తోడు, వైఎస్సార్ గోరుముద్ద, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ కంటి వెలుగు తదితర కార్యక్రమాల ద్వారా ఈ లబ్ధి చేకూర్చారు.

చెర్లోపల్లి సచివాలయ పరిధిలో..	
డీబీటీ ద్వారా జరిగిన లబ్ధి	రూ.6,50,06,821
నాన్ డీబీటీ ద్వారా జరిగిన లబ్ధి	రూ.3,24,32,938
మొత్తం:	రూ.9,74,39,759
అభివృద్ధి పనులకు వెచ్చించిన మొత్తం	రూ.5.12 కోట్లు

అభివృద్ధికి సమ ప్రాధాన్యం

సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులకు కూడా ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇచ్చింది. చెర్లోపల్లి పంచాయతీ పరిధిలో ఐదేళ్ల కాలంలో రూ.5.12 కోట్లతో సీసీరోడ్లు, మురుగు కాలువలు, సచివాలయం, ఆర్బీకే తదితర భవనాల నిర్మాణం, తాగునీటి కోసం పైపులైన్ల నిర్మాణం చేపట్టారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం నిర్మాణ దశలో ఉంది.

ఎన్నడూ లేనంత అభివృద్ధి



చెర్లోపల్లి చరిత్రలో గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి ఈ ఐదేళ్ల కాలంలో జరిగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక గ్రామ రూపురేఖలు మారిపోయాయి. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు కూడా అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

– చేడిమాల శ్రీలత, సర్పంచ్, చెర్లోపల్లి

ఇది పేదల ప్రభుత్వం



ఈ ప్రభుత్వం వచ్చాక పేదలకు అన్నిరకాలుగా సాయం అందుతోంది. పేద తల్లులకు అమ్మఒడి, వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు 3 వేల పింఛన్, పొదుపు మహిళలకు రుణ మాఫీ చేశారు. ఆటో డ్రైవర్లు, టైలర్లు, తోపుడు బండ్లు వాళ్లకు కూడా ఆర్థిక సాయం అందిస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్ పాలన చేస్తున్నారు.

– గుండాల వజ్రమ్మ, ఎంపీపీ, చెర్లోపల్లి ఎంపీటీసీ



కొత్తగా నిర్మించిన సీసీరోడ్డు



కొత్తగా నిర్మించిన మురుగు కాలువ

సంతోషంగా అన్నదాతలు



ఈ ప్రభుత్వంలో గతంలో ఎన్నడూ లేనంత ప్రాధాన్యం రైతులకు ఇస్తున్నారు. ఊరూరా రైతు భరోసా కేంద్రాలు నెలకొల్పి రైతులకు అవసరమైన విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు, ఎరువులు అందజేస్తున్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వర్షాభావ పరిస్థితుల్లో సైతం సకాలంలో కండలేరుకు సాగునీరు విడుదల చేయించి పంటలు పండేలా చేశారు. ధాన్యం ధరలు గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగాయి. రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారు.

– ఇసనాక రాజారామిరెడ్డి, రైతు, చెర్లోపల్లి

క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి పల్లకిసేవ



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న శ్రీలక్ష్మి గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్వామి, అమ్మవార్ల పల్లకిసేవను వైభవంగా నిర్వహించారు. తొలుత ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేటి నుంచి కుంభాభిషేక మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని త్యాగరాజనగర్‌లో ఉన్న సద్గురు త్యాగరాజ స్వామి మందిరంలో ఆదివారం నుంచి మంగళవారం వరకు కమలాంబిక సమేత త్యాగరాజేశ్వరస్వామి వార్షిక కుంభాభిషేకం, శ్రీశత చండీయాగ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు మందిర కమిటీ సేవకుడు నాగదేవి ప్రసాద్ శనివారం తెలిపారు. మాచవోలు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరుగనున్న కుంభాభిషేకం, చండీయాగ మహోత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామివారిని కోరారు. అలాగే మందిరంలో కొలువైన సిద్ధివిఘ్నేశ్వర, సుబ్రహ్మణ్య, జ్ఞాన సరస్వతి, ఆదిత్యాది నవగ్రహ, శిరిడీ సాయినాథ, దక్షిణామూర్తి, కమలాంబిక సమేత త్యాగరాజేశ్వర, సీతారామలక్ష్మణ హనుమత్సమేత సద్గురు త్యాగరాజస్వామి వారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

ముత్తుమారి అమ్మవారికి నగరోత్సవం



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

నెల్లూరు(బృందావనం) : పొదలకూరు రోడ్డులోని ఇందిరా గాంధీనగర్‌లో ఉన్న ముత్తుమారి అమ్మవారి దేవస్థానంలో వార్షిక మహోత్సవంలో భాగంగా శనివారం అమ్మవారి నగరోత్సవం కనులపండువగా నిర్వహించారు. తొలుత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కావడిని విశేషంగా ముస్తాబు చేశారు. అమ్మవారిని అందులో కొలువుదీర్చి నగరోత్సవం చేపట్టారు. సంజీవ నగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల మీదుగా వేల్‌కావిడి, కలశాలు, కరగం, పూల తొట్టి, ఇడుంబన్, మంగళవాయిద్యాలతో విద్యుద్దీపాలంకరణలు, బాణసంచా వెలుగులతో నగరోత్సవం వైభవంగా సాగింది. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు.

ఆదిశంకరాచార్య స్మరణోత్సవాలు ప్రారంభం



ప్రవచనం ఇస్తున్న శ్రీరామలాల శర్మ

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పొగతోటలో ఉన్న ఆదిశంకర ధ్యానమందిరంలో చక్రాలవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదిశంకరాచార్య సంస్మరణోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. తిరుపతి కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు బ్రహ్మశ్రీ ఓరుగంటి శ్రీరామలాల శర్మ 'భాష్య సూత్ర ప్రవచన సప్తాహం'లో భాగంగా ప్రవచనం చేశారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో మందిర కమిటీ అధ్యక్షుడు వెంకటశ్రీధర్‌శర్మ, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనంద్‌కుమార్, మేనేజర్ చక్రాల వెంకటలక్ష్మి నరసింహం, వి.హరిప్రసాద్‌రావు, కె.గిరిజాలక్ష్మి, ఎం.లక్ష్మీనరసింహారావు, ఎ.సత్యనారాయణ, టి.లక్ష్మీనారాయణ, పావని అనిల్‌కుమార్‌శర్మ, సుబ్రహ్మణ్యశర్మ, కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులను నియంత్రించాలి

నెల్లూరు(అర్బన్): ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు ఇష్టారాజ్యంగా విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న లక్షలాది రూపాయల ఫీజులను నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీహర్ష డిమాండ్ చేశారు. శనివారం స్థానిక బాలాజీనగర్‌లోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో సైతం కళాశాలలు నిర్వహిస్తున్నారని, అలాంటి వారిపై విద్యాశాఖాధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరారు.

విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

విడవలూరు : గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాలను పిల్లలందరూ ఉపయోగించుకోవాలని లైబ్రేరియన్ టి.నిరూప కోరారు. మండల కేంద్రమైన విడవలూరులోని శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆమె శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తామని తెలియజేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను స్థానిక గ్రంథాలయానికి పంపించాలని కోరారు. వీటి వల్ల పిల్లలకు విజ్ఞానంతో పాటు కథలు, ఆటలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు.



వేసవి విజ్ఞాన శిబిరంలో చిన్నారులు

'ఏపీ హంస' నూతన కార్యవర్గ ఎన్నిక



హంస కోవూరు తాలూకా నూతన కార్యవర్గం

కోవూరు : ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీ హంస) కోవూరు తాలూకా యూనిట్ నూతన కార్యవర్గాన్ని స్థానిక కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో శనివారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ కోవూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా కేఆర్ఎం బెనర్జీ, తాలూకా సెక్రటరీగా ఆసియా బేగం, ట్రెజరర్‌గా పఠాన్ అబ్దుల్ సుకుర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డి.వేణు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.రాఘవేంద్ర, పబ్లిసిటీ సెక్రటరీగా సోలా ఉమా, వైస్ ప్రెసిడెంట్లుగా బి.సుమతి, జి.కామాక్షి, వరకుమార్, ఎస్.రాజేంద్రప్రసాదరావు, జి.మాధవి మహిళా సెక్రటరీగా కేవీ రమణమ్మ, జాయింట్ సెక్రటరీలుగా రమేష్, లక్ష్మి, జె.షీలా, సుకన్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ వైద్య ఉద్యోగుల డిమాండ్ల సాధనలో నిర్విరామంగా కృషి చేస్తామని తెలిపారు.

శేషవాహనంపై ప్రసన్నవిశ్వేశ్వరుడు

ఇందుకూరుపేట : మండలంలోని మైపాడులో కొలువైన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు శనివారం శేషవాహనంపై ఊరేగారు. మేళతాళాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగుతున్న స్వామివారికి భక్తులు కొబ్బరికాయ కర్పూర హారతులు పట్టి పూజలు చేశారు. ఆలయ అర్చకుడు బండారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఉభయకర్తలుగా స్థానికుడు గుడి సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఉదయం ధ్వజారోహణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు.



వెంకయ్యస్వామికి ప్రత్యేక పూజలు

మనుబోలు : మనుబోలు–చెర్లోపల్లి మార్గంలోని భగవాన్ వెంకయ్యస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు శ్రీనివాసులు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి పంచామృతాభిషేకం జరిపించి పుష్పాలంకరణ చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వద్ద హోమగుండం వేసి ధునిపూజ చేశారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని కొబ్బరికాయలు, పూలు పండ్లు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ప్రత్యేకాలంకరణలో వెంకయ్యస్వామి

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

వెంకటాచలం : వెంకటాచలానికి చెందిన కోడూరు అనీల్‌ను టీడీపీ నాయకులు కులంపేరుతో దూషించడంపై నమోదైన కేసుపై డీఎస్పీ వీరాంజనేయరెడ్డి శనివారం విచారణ చేపట్టారు. ఈనెల 13వ తేదీన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వెంకటాచలంలోని పోలింగ్ బూత్ వద్ద ఉన్న కోడూరు అనీల్‌ను టీడీపీ నాయకులు సండి రమేష్, రాజేంద్ర, రమణయ్య, మరో ఎనిమిది మంది కలిసి కులం పేరుతో దూషించి దాడికి పాల్పడ్డారు. ఈ విషయంపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై డీఎస్పీ వీరాంజనేయరెడ్డి శనివారం వెంకటాచలం వచ్చి విచారణ చేపట్టారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పొదలకూరు : మండలంలోని నల్లపాళెం గ్రామానికి చెందిన మల్లె నాగేశ్వరరావు గత నెల 17వ తేదీన రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై డి.రామకృష్ణ కథనం మేరకు వివరాలు.. నాగేశ్వరరావు(34) మోటారుబైక్‌పై నల్లపాళెం నుంచి వరదాపురం మీదుగా వెళ్తుండగా అదుపుతప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావుకు నెల్లూరు ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

జేఎస్ రెడ్డి సంస్మరణ సభ నేడు

నెల్లూరు(బృందావనం) : పారిశ్రామికవేత్త, రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రి స్థాపక దాత జక్కా శ్రీనివాసులురెడ్డి (జేఎస్.రెడ్డి) సంస్మరణ సభ నెల్లూరు పుర మందిరంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు రేబాల లక్ష్మీనరసారెడ్డి టౌన్‌హాల్ ట్రస్ట్‌బోర్డు వారు శనివారం తెలిపారు. ఆయన అభిమానులు, నెల్లూరీయులు, సన్నిహితులు, మిత్రులు పాల్గొని జేఎస్.రెడ్డికి నివాళి అర్పించాలని కోరారు.

రక్తదాన శిబిరం నేడు

నెల్లూరు(బృందావనం) : పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరం ఆధ్వర్యంలో శ్రీసాయిమాత నిత్య అన్నప్రసాదాలయం ద్వారకామయిలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు మందిర కమిటీ చైర్మన్ మధుసూదన్‌సాయి శనివారం తెలిపారు. శ్రీసాయిదర్బార్ యువ సేవాదళ్ సభ్యుడు కనుమూరు సాయినాథ్‌రెడ్డి జ్ఞాపకార్థం రక్తదాన శిబిరాన్ని ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రక్తదాన శిబిరంలో పాల్గొనే వారు 95028 49784, 98663 38933 నంబర్‌ను సంప్రదించాలన్నారు. రక్తదానంతో ప్రాణదాతలు కావాలని కోరారు.

కన్యకాపరమేశ్వరికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

పొదలకూరు : పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీదేవి దేవస్థానంలో అమ్మవారి జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు గోపూజ, 8.30 గంటలకు పంచామృత అభిషేకం, 9.30 గంటలకు అలంకరణ, 11 గంటలకు లలితా సహస్రనామ పూజ, ఖడ్గమాల, 12 గంటలకు హారతి, 12.30కి అన్నప్రసాద వితరణ చేశారు. ఉభయకర్తలుగా రాఘవేంద్ర–ప్రమీల, వాసుదేవరావు–పార్వతి దంపతులు వ్యవహరించారు. సాయంత్రం 6.30 గంటలకు సామూహిక మల్లెల అర్చన, రాత్రి 8 గంటలకు నక్షత్ర హారతి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ ప్రత్యేక పూజల్లో ఆలయ చైర్మన్ ఆదూరు వెంకటసుబ్బయ్య, కార్యదర్శి రాచపూటి రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఉభయకర్తలు

ఖగోళ శాస్త్రం.. అవకాశాలు ఘనం



బుచ్చిరెడ్డిపాళెం గ్రంథాలయంలో అంతర్జాతీయ ఖగోళ శాస్త్ర దినోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : రానున్న కాలంలో ఖగోళ శాస్త్రంలో అవకాశాలు ఘనంగా ఉంటాయని బుచ్చిరెడ్డిపాళెం శాఖా గ్రంథాలయ అధికారిణి కె.మంజులత అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో అంతర్జాతీయ ఖగోళ శాస్త్ర దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతరిక్ష రంగంలో విశిష్ట సేవలు అందించిన కలాం, సునీతా విలియమ్స్, రాకేష్ శర్మలు విద్యార్థులకు ఆదర్శం అని తెలిపారు. నేటితో భారతావని అణుపరీక్షలు నిర్వహించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఫోక్రాన్–1, ఫోక్రాన్–2 గురించి విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం 'ఖగోళ శాస్త్రంలో భారతీయుల పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు పలురకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ గ్రూపు సభ్యులు గండికోట సుధీర్ కుమార్, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.